# స్నేహలత

చక్రధరం చెరువు ప్రక్క రావిచెట్టుకింద చుట్ట కాలుస్తు కూర్చున్నాడు. అతనువచ్చి అరగంటదాటింది. వస్తానన్న రాజశేఖరం యింత వరకూ రాలేదు.

"ఛ—వీడెప్పుడూ యింతే చేస్తానన్నపని చేయడు. వస్తానన్న సమయానికి రా''డంటూ విసుక్కుని చుట్ట అవతల విసిరి గట్టిగా ఊపాడు చక్రధరం.

రాజశేఖరం, చక్రధరం బాల్యమిత్రులు. చక్రధరానికి రాజశేఖరానికన్నా స్థితిగతులు బాగున్నాయి. రాజశేఖరం బడిపంతులు. చక్రధరం భూస్వామి. ఇద్దరివీ యిరుగు పొరుగు ఊళ్ళు. నందమూరు చెరువుగట్టున కూర్చుంటే మధిరపాడుని కలిపే కంకరరోడ్డు స్పష్టంగా కానవస్తుంది. రాజశేఖరం రావాల్సింది ఆరోడ్డునే. అసలంటూ వస్తుంటే, అతని నడక తీరునుబట్టి యిట్టే గ్రహించగలడు చక్రధరం.

ఇలాగైతే చక్రధరానికి కొంత మనశ్శాంతి దక్కేది. లేదు. రాజశేఖరమనే శాల్తీ ఆ కంకరరోడ్డుమీద కాలు మోపలేదు. అందుకే చక్రధరానికి అసహనం క్షణక్షణానికి పెరిగిపోతోంది.

తేల్ప్రోలు బస్సు పంటకాలువ దగ్గర ఆగింది. అందులోంచి "అమ్మయ్య" అనుకుంటూ దిగి కండువా సరిజేసుకున్నాడు రాజశేఖరం. గడియారం చూసుకున్నాడు. అయిదున్నర అయింది. చక్రధరం ఈపాటికి రావిచెట్టుదగ్గిరికి వచ్చివుండాలి. ఆలస్యానికి పొగలు, సెగలు కక్కుతుండాలి అంటూ ఊహించాడు రాజశేఖరం.

రాజశేఖరం రావిచెట్టు చేరేసరికి చక్రధరం చెట్టు మొదలుకి తలవాల్చి అర్ధనిమీలిత నేత్రుడై వున్నాడు. అతని చూపులింకా కంకరరోడ్డుని వదలలేదు "బస్సుదొరికి చావలేదోయ్... ఆలస్యమయింది క్షమించు" మూడు మాటలు మాట్లాడి అతని సరసన కూలబడ్డాడు రాజశేఖరం.

కళ్ళు సాంతం తెరిచి "ఇపుడెక్కడ్నుంచీ ఊడిపడ్డావ్ తేల్ప్రోలు బస్సులోంచా? ఎక్కడికెళ్ళావ్ ఉయ్యూర్రా?" ప్రశ్న. జవాబు మిళితమై ఉండటంవల్ల రాజశేఖరానికి శ్రమ తప్పింది. అడిగినదానికల్లా ఔనని తలూపాడు.

"వచ్చి ఎంతసేపైంది?" సౌమ్యంగా ప్రశ్నించాడు.

"గంట" తీవ్రంగా అన్నాడు చక్రధరం

ఆ మాట అబద్ధమని తెలుసు శేఖరానికి తను రమ్మ న్నది అయిదింటికి, ప్రస్తుతం తేడా అరగంట మించలా. అతని కోపం చల్లారడానికి రెండునిముషాలు మౌనంవహించి "నీకు చెప్పలేదనుకుంటా!... స్నేహాలతని త్వరలో వివా హం చేసుకోబోతున్నాను—" శేఖరం సాదాగా అన్నాడు.

"స్నేహాలత!...స్నేహాలతని పెళ్ళి చేసుకోబోతు న్నావా?" ఆశ్చర్యమంతా కోపమంతా మర్చిపోయాడు చక్రధరం,

"అవును?" ప్రశాంతంగా అన్నాడు శేఖరం.

చక్రధరానికి మతిపోయింది "స్నేహా... ల—త?" ఆమె పేరు తల్చుకుంటేనే అతనికి వళ్ళు కంపరంపుడు తోంది.

తీవ్రంగా చూసి ప్రశ్నించాడు శేఖరాన్ని-"బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చావా?" అంటూ.

"అలాగే అనుకోవల్సివుంది!" శేఖరం జవాబు.

"ఊ—యిదేనా నీవు ఇంతసేపు నన్ను కూర్చో బెట్టి చెప్పదలచుకున్న గొప్ప సంగతి" వ్యంగ్యంగా అడి గాడు.

"కాదు చక్రీ! నాకు నీ సాయం కావాలిరా. కాదన వన్న ధైర్యంతో అడుగుతున్నాను. చేస్తావుకదూ?" సామ్రయంగా అడిగేడు.

"ఎలాంటిదా సాయం?" భృకుటిముడిచి ప్రశ్నించాడు.

"నేను ఒంటరిగాడినన్న విషయం నీకు తెలియనిది కాదు. మిత్రుడివైనా ఆత్మబంధువైనా అన్నీ నీవే దగ్గరుండి యీ శుభకార్యాన్ని దిగ్విజయముగా చేయించమని కోరుతున్నాను" అర్థించాడు శేఖరం.

చక్రధరం ఆశ్చర్యపోయాడు.

"నేను చేయించాలా ఈ పెళ్ళి? శేఖరం! అది అసాధ్యం...ఎన్నటికీ జరగదు జరగనే జరగదు—" ఖండితంగా తేల్చి చెప్పి తల తిప్పుతున్నాడు చక్రధరం—

"ఆలోచించు...ఆమె నీకు చేసిన ద్రోహం ఏమిటి? ఆమె అమాయకంగా ఒకనాడు నిన్నేదో అవమానించి వుండొచ్చు— అంత మాత్రంచేత—" ఈ మాటలు బాగా పనిచేశాయి చక్రధరం మీద.

"శేఖరం! గతాన్ని గుర్తుకు తెచ్చి నన్నెందుకు బాధిస్తావ్? నీవు కోరేది నా సాయమే అయితే—నాకు వీలయిన విధంగా చేస్తాను. ఇంతటితో ఈ విషయాన్ని ముగించు" అన్నాడు చక్రధరం అప్రసన్నంగా చూస్తూ.

* * * *

చక్రధరం యింటికి చేరింది మొదలు ఒకటే ఆలోచన, ఒకటే చింత, ఒకటే బాధ. వీడికి— శేఖరంగాడికి హఠాత్తుగా ఈ ఆలోచన ఎలా ఉద్భవించింది? దేశంలో పిల్లలు కరువైనట్టు ఆ పంతులమ్మే దొరికిందా? పైగా నా సాయం కావాలట...నా సాయం! వళ్ళు మండుకొచ్చింది అతనికి.

చక్రధరానికి మనస్సు మనస్సులో లేదు. ఆలోచిస్తున్నకొద్దీ అతని మనస్సుకి తీరని వేదన కలుగుతున్నది. అతనికళ్ళముందు "స్నేహాలత" రూపం గోచరించింది. తానొకనాడు ఆమెచేత అవమానించబడటం తల్చుకుంటే పుండుపై కారం జల్లిన భావోద్వేగం కలుగుతుంది.

ఆనాడు...ఈనాటికే కాదు—మరెప్పటికి మరపు రానిది...స్నేహాలత ఆ ఊరొచ్చిన క్రొత్తలో మలేరియా డిపార్టుమెంటులో పనిచేస్తుండేది.

ఆనాడు!!

తన "టూర్" ముగించుకోబోతూ దీపాలు పెట్టబోతున్న వేళ ఊరిచివరనున్న చక్రధరం యింటికి బయలుచేరింది స్నేహాలత.

ఎత్తుమడమల జోళ్ళతో ఆకర్షణీయమైన అలంకరణలతో తాను ఏకాకిగా యింట్లో ఉన్నప్పుడు—చేతిలో ఒక పుస్తకం ధరించి వచ్చింది స్నేహాలత. ఆమె రాకని ముందు

గానే అల్లంతదూరంలో పసిగట్టాడు చక్రధరం. ఇంట్లో భార్య లేదు తొలి కాన్పుకోసం పుట్టింటికెళ్ళి నెలదాటింది. చావిట్లో కుర్చీలు సర్దుతున్నాడు పాలేరు కొండయ్య. వాడిని రహస్యముగా పిలిచి చెవిలో ఏదో చెప్పి, తాను పడగ్గదిలో కెళ్ళి ముసుగుతన్ని పడుకున్నాడు చక్రధరం.

స్నేహలత చొరవగా వచ్చి "ఇంట్లో అంతా కులాసా ఏనా కొండయ్యా" అంది.

వాడు చేతులు నులుముకుంటూ దిగులుగా మొహం పెట్టి "ఏం చెప్పమంటారమ్మా? అయ్యగారికేమీ బాగా లేదు. ఒళ్ళు వేడిగా ఉందని ఉదయంనించి పడుకున్నారు. ఊళ్ళో దోమకాటు విపరీతంగా ఉంది. ఒకవేళ మలేరియా ఏమోనని..."

"ఎక్కడున్నారాయన?" ఆదుర్దాగా ప్రశ్నించింది. అది ఆమె వృత్తిధర్మం. "లోపల ఉన్నారమ్మా..." వినయంగా జవాబిచ్చాడు కొండయ్య.

"ఇంట్లో దీపం పెట్టలేదేం ఇంకా? దీపం ఒకటి పట్రా" అంటూ జాకెట్టులోంచి పెన్నుతీసి లోపలికి వెళ్ళింది, రెండు గదులు దాటింతరువాత పడగ్గదిలో తెల్ల దుప్పటి ముసుగేసుకుని పడుకున్న చక్రధరం అగుపించాడు.

ఆమె వస్తున్న సవ్వడికి అతని రక్తనాళాలు వేగంగా కంపించాయి. ఉద్రిక్తస్థాయి చిట్టచివరి మెట్టెక్కింది. ఆమె సమీపానికి వచ్చింది.

"చక్రధరంగారూ!" మెల్లిగా పిలిచింది.

జవాబు లేదు,

చేత్తో మొహంమీదనుండి దుప్పటి తొలగించి, నుదిటిమీద చెయ్యివేసి చూసింది చిరువెచ్చగా తగిలింది చేతికి! అది మలేరియా జ్వరం కాదు—కామజ్వరం.

చక్రధరం ఆమె చేతినలాగే పుచ్చుకుని మీదకి లాక్కున్నాడు. ఆశించని ఈ హఠాత్సంఘటనకి తెల్లబోయిందామె, ఆలోచించటాని కవకాశం ఇవ్వకుండా ఆమె ముఖాన్ని ముద్దులతో ముంచెత్తాడు, ఆమె కీచుగా "కొండయ్య అంటూ అరిచింది. యింకెక్కడ కొండయ్య!" ఆమె హృదయం గాభరాగా దడ, దడలాడింది. శక్తికొలది పెనుగులాడుతూ "చక్రధరం గారూ! ఇదిమీకు భావ్యం కాదు. బయటికి పెద్దమనిషిలా..." ఆమె పెదవులు కదలటాని కవకాశం యివ్వకుండా అధరామృతాన్ని గ్రోలసాగాడు చక్రధరం.

ఆమె గట్టిగా గుంజుకుని శక్తిలా విజృంభించింది. అతని చెంపలదిరిపోయాయి. రవిక సగానికూడి పాలిళ్ళు బయటి ప్రపంచాన్ని—కాదు, చక్రధరాన్ని తీవ్రంగా చూస్తున్నాయి. ఆమె దీర్ఘ ఉచ్ఛ్వాస నిశ్వాసలకు కంపిస్తూ చీరనడుంమీదనుండి జారిపోయింది. జుట్టు రేగిపోయి మొహమంతా ఆక్రమించింది.

"నన్ను సమీపించవద్దు. దగ్గరకొస్తే ఏం చేస్తానో
నాకే తెలియదు..." ఆమె గర్జించింది. చక్రధరం ఆమెని
సమీపించే సాహసం చెయ్యలేదు. అస్తవ్యస్తంగా ఉన్న
బట్టల్ని సరిచేసుకుని జుట్టుపై కెగదోసుకుని, మలేరియా రిజి
ష్టరుతో బయటకెళ్ళిపోయింది.

లైటు వెలిగించి తీసుకొచ్చి పెడుతూ "మీది మెతక
గుండె బాబూ! మీరేం చెయ్యలేరు..." అన్నాడు
కొండయ్య. తన మగతనాన్నెత్తి పొడిచినట్లనిపించింది చక్ర
ధరానికి. ఏదో అనేలోగానే కొండయ్య వెళ్ళిపోయాడు.

ఇది జరిగిన రెండునాళ్ళకి స్నేహలత ఒంటరిగా అవు
పించి ముసి, ముసిగ నవ్వుతూ "చక్రధరంగారూ! రాత్రి
పొద్దుపోయిన తర్వాత మా ఇంటికి రండి కొంచెం పనుంది"
అంటూ కదిలిపోయింది. స్థాణువైపోయాడు చక్రధరం.
అది పట్టపగలు కాకుండా వుంటే తప్పక కల అనుకుని వుండే
వాడే. తమ నెవరన్నా గమనించారేమోనని అటూ యిటూ
చూసి లేనందుకు సంతోషించి గర్వంగా కాలరు సరిచేసు
కుంటూ వెళ్ళిపోయాడు చక్రధరం.

ఆ రాత్రి స్నేహలత ఇంటిముందు పెద్దగుంపు
వాళ్ళమధ్య ముద్దాయిలా చక్రధరం! శాపనార్థాలు పెడు
తున్న స్నేహలత ముసలినాయనమ్మ. చక్రధరానికి తల
నున్నగా గొరిగి, సున్నం బొట్లుపెట్టి గాడిదమీద ఊరే
గించినంత అవమానం కలిగింది. పెద్దమనుషులు మెత్తగా
చీవాట్లుపెట్టి పంపించేశారు. దించిన తల ఎత్తకుండా ఇంటి

దారిపట్టిన చక్రధరాన్ని చూసి, తన పగతీరినందుకు సంతృప్తిగా నిట్టూర్చింది స్నేహలత.

యీ విషయం కార్చిచ్చులా ఊరంతా అరక్షణంలో వ్యాపించింది. ఫలానా చక్రధరం పెద్దమనిషి అనుకున్నాం వట్టి జులాయి వెధవ. భుక్తికోసం కడుపు చేత్తో పట్టుకొచ్చిన ఆ స్నేహలత యింటికి వెళ్ళి ఎన్ని గుండెల కలవాడు కాకపోతే చెయ్యిచ్చుకుంటాడు?—ఈ వ్యాఖ్యానం రాజశేఖరం చెవిలోపడి ఆదరాబాదరా మిత్రునింటికి వెళ్ళాడు "ఇది నిజమేనా?" అంటూ తాను విన్నదంతా ఏకరువుపెట్టాడు.

---

బావురుమని—అసలు జరిగిందంతా చెప్పి, తనను అవమానపరచాలన్న ద్రోహబుద్ధితోనే స్నేహలత అలా చేసిందన్నాడు చక్రధరం.

"అయినా నీకిదేం విపరీతబుద్ధి? నిప్పై కాలుతుందని తెలిసి ముట్టప్రయత్నించడమా? ఇప్పుడు ఆకులుపట్టుకుని వగస్తే ఏమిటి ప్రయోజనం?" అంటూ తానూ రెండు చీవాట్లు పెట్టాడు.

"ఊరంతా పెట్టింది తక్కువనా పొరుగూరువాడివి మరికాస్త పెడుతున్నావ్?" చక్రధరం కోపంగా అడిగాడు.

అతని ప్రశ్నకి జవాబొచ్చింది శేఖరానికి. "ఏడ్చావ్‌లే! ఇప్పటికైనా కాస్త బుద్ధి తెచ్చుకుబ్రతుకు" అని స్నేహలత యింటికి వెళ్ళి మిత్రుని తరఫున తను క్షమాపణలు

కోరాడు. ఆమె అతన్నెంతో గౌరవించి తగినవిధంగా జవాబిచ్చి పంపేసింది. ఆతర్వాత మలేరియా డిపార్టుమెంటు ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి ఆ ఊళ్ళోనే బోర్డుస్కూల్లో టీచర్‌గా చేరింది స్నేహలత. ఆమెనందరూ అభిమానించేవారు, నిప్పులాంటి మనిషి సుమా, అనుకుంటారు.

రాజశేఖరంకి ఆమె అంటే ప్రత్యేకాభిమానం ఏర్పడింది. ఆ అభిమానంతోనే అంగీకారంమీద వివాహానికి ఏర్పాటుచేసుకోసాగాడు. అతను స్నేహలతలో ఎన్నో చూశాడు. కష్టాలలో బ్రతకటం ఎరుగునామె. కష్టాలెన్నెదుర్కొనే ధైర్యసాహసాలున్నాయామెకు. మంచికిమంచి చెడుకి చెడుతో జవాబివ్వగలనేర్పరితనం వున్నది — ఇంతకంటే తన గృహిణిలో రాజశేఖరం ఎక్కువ కోరదల్చుకోలేదు.

ఇది గతించిన గతం...

ప్రస్తుతంలో రాజశేఖరం తన వివాహానికి చక్రధరం సాయం అడిగాడు! చక్రధరం ద్వంద్వంలో పడ్డాడు ఈ పెళ్ళికి తానే మొహంతో పెద్దరికంవహించగలడు? ఒకనాడు ద్రోహబుద్ధితో ఎవరి శీలాన్నపహరించ బూనాడో ఆమె నేడు తన మిత్రుని భార్యకాబోతున్నది, ఈ వివాహంవల్ల తమ మైత్రిబంధం సన్నగిలి, స్నేహలత వాడి ఎండిపోవచ్చును. యీ వివాహం తమ మిత్రత్వానికి స్వస్తివచనం కాబోదుకదా!

అతని ఆలోచనలు భగ్నంచేస్తూ, ఆ సమయంలో అతని భార్యవెంట స్నేహలత లోపలికి వచ్చి "నమస్కారం అన్నయ్యా!" అంది చేతులు జోడించి. చక్రధరం "నమస్కారం" అన్నాడు అప్రయత్నంగానే ఆమెవింత ఆగమనానికి ఆశ్చర్యపోతూ.

ఆమె సమీపానికి వచ్చి "తెలిసీ తెలియక ఎన్నో తప్పులు చేస్తుంటాం. తప్పుచేశామని గ్రహించి సరిదిద్దుకోవటం విజ్ఞుల లక్షణం. ఆనాటి సంఘటన ఒక పీడకలలాంటిది. దాన్ని మర్చిపోయి మా నూతనజీవితానికి నీ ఆశీస్సులు కురిపించన్నయ్యా! నా వల్ల అపరాధం జరిగివుంటే మనస్ఫూర్తిగా మన్నించు" అంటూ పాదాలమీద వాలింది

ఆ కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. "లే చెల్లాయ్! లే! నేనంత ఉన్నతుణ్ణి కాదు గండశిలల్నైన తంకరిగించగల సామర్థ్యం గల నీకు జీవితంలో అపజయం ఎప్పటికీ వుండదు. మీ జీవితం మూడుపువ్వులూ ఆరుకాయలుగాకలకాలం వర్ధిల్లుతుంది. క్షమించవలసింది నేను కాదు నువ్వే! నీలాంటి సోదరి లభించినందుకు ఎంతో గర్విస్తున్నాను" అంటూ లేవదీశాడు చక్రధరం. భర్తలో కలిగిన మార్పుకి వేయి దేముళ్ళకి నమస్కరించింది మాలతి.

"వస్తానన్నయ్యా! సకుటుంబంగా వచ్చి మా వివాహం నీవే జరిపించాలి" అంది స్నేహలత.

"అలాగే—తప్పకుండానమ్మా" అంటూ హామీయిచ్చాడు చక్రధరం. అతని మనస్సిపుడు మబ్బులు విడిపోయిన ఆకాశంలా నిర్మలంగా వుంది.

స్నేహాలత కాదు "స్నేహామయి" అని వుంటే బాగుండేది. ఆనాడు పదిమందిలో అవమానించి కాదు- నేడు ఒక్క తెగ "అన్నయ్యా" అంటూ ఆప్యాయంగా పలకరించి తనను ఓడించింది, ఇలా జరుగుతుందని తాననుకున్నాడా? తాను అనుకున్న వెప్పుడైనా జరిగాయా లేదు. అలా జరిగివుంటే యిలా సుఖాంతమయ్యేది కాదు.

తమ మైత్రీబంధం సన్నగిల్లుతుందన్న భయం ఇవుడు లేదు, స్నేహాలత క్రొత్త చిగుళ్ళు వేసి మరింత దృఢమవుతుందనటంలో సందేహం లేదు.

చక్రధరం సంతోషంగా కళ్ళు మూసుకున్నాడు.

(అభిసారిక)